# అత్యాధునిక వింత దోపిడీ

"ఒక వ్యక్తిని వేరొక వ్యక్తీ, ఒక జాతిని వేరొక జాతి- దోచుకుతినడం; ఇంకానా ? ఇకపై సాగదు !" అంటూ మహాకవి వాక్యాన్ని ఉదహరించి, ఘోరున ఉపన్యాసం ఇచ్చేను. జనం కర-చర- తాళ- ధ్వనులు చేసి నన్ను ఉత్సాహపరిచేరు.

''ఇదీ బాగానే వుందే !" అనుకుని దోపిడీ సాహిత్యాన్ని ఉత్పత్తి చెయ్యసాగాను. అనగనగా ఒక పెట్టుబడిదారు అతని కింద ఫలానా ఇంతమంది కార్మికులు- అనగనగా ఒక భూస్వామి— అతని కింద ఎంతోమంది కర్షకులూ అంటూ కథలూ నవలలూ నాటికలూ రాసేను.

ఒక నవలకి 'వామపక్ష ప్రచురణలు' వారు నాలుగువేల రూపాయలు అవార్డిచ్చారు. ఒక కథకి 'యవ్వనం' పత్రికవారు వెయ్యి రూపాయలు బహుమతి ఇచ్చారు. ఒక నాటిక యాభై ప్రదర్శనలై పదిహేను పరిషత్తుల్లో బహుమతులు గెల్చుకొంది.

నా సాహిత్యంలో పాత్రలందరూ పతితులు, భ్రష్టులు, బాధా సర్ప దష్టులూనూ, గనిలో, పనిలో, కార్ఖానాల్లో కార్మికులు, పంట పొలాల్లో వ్యవసాయ కూలీలు, పబ్లిక్ ఆఫీసులకి కేరేజీలు తెచ్చే ఆడవాళ్ళు, పట్టణాల్లో, పరిసరాల్లో రిక్షాలులాగే శ్రామికులు కొద్దిమంది సుఖంకోసం వందలాది, వేలాది జీవులు, చెమటోడ్చడం నా నిత్యకథా వస్తువు. ఆ ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబును నేనే, మరి ! ఎందుకంటే, ఏ స్వేదకథ రాసినా, ఏ ఘర్మ (గరమ్) నవల రాసినా అంతో యింతో పారితోషికం ముడుతూనే వుంది నాకు.

కథ పంపమని ఉత్తరం వస్తే 'వెంటనే నూరు రూపాయలు మనియార్డర్ చెయ్యండి' అని జవాబులు రాసేను. వ్రాతప్రతి అంద గానే, అని వాళ్లు రాస్తే కథను వి. పి. పార్సెల్లో పంపాను. నవల రాయమని అడిగితే అడ్వాన్సు పుచ్చుకున్నా నన్నమాటే సగం నవలకి మించి ఎన్నడూ ఎవరికీ మొదటి వాయిదాగా పంపలేదు. మిగతా డబ్బు ఇవ్వందే మిగతా నవల ఎప్పుడూ పంపలేదు. మొదటి సగంతో ఆగి పోయిన పత్రిక అయితే ఆ నవల 'అసంపూర్తి నవల' గా మిగిలి పోయింది, అంతే.

పోనివ్వండి నాకేం? ఆ విధంగా, జ్ఞాన సంబంధమైన నా శ్రమను పత్రికలవాళ్లు ఎక్స్ప్లాయిట్ చెయ్యకుండా కాపాడుకున్నాను. అందరూ నాలాగే తమ తమ శ్రమలను ఆయా వస్తువుల ఉత్పత్తిదాగ్లు ఎక్స్ప్లాయిట్ చెయ్యకుండా కాపాడుకోవాలనీ వీలైతే దోపిడీదారుడి జుట్టు తమ చేతుల్లో వుంచుకోవాలని నా రచనల సారాంశం. ఎక్కడ ఉపన్యాసం యిచ్చినా ఆ సంగతి మాత్రం బల్లగుద్ది చెప్పాను.

'వెంటనే మద్రాసు రండి' అని ఒకాయన టెలిగ్రాం, మని యార్డరు పంపాడు. ఆ పేరూ అడ్రసూ చూసి 'ఇతను గొప్ప సినిమా ప్రొడ్యూసరోయ్' అని చెప్పాడు మిత్రుడు సత్యం.

'ఎందుకు రమ్మంటున్నా డంటావు?' అన్నాను.

'ఏముంది? నీ కథో నవలో ఏదో చదివుంటాడు. సినిమా తీస్తాడేమో, వెళ్లు గోల్డెన్ ఛాన్స్!!' అని సత్యం ఎంకరేజ్ చేశాడు.

"రానూపోనూ రైలు ఖర్చులు పంపాడుగా" అని ధైర్యంతో బయల్దేరాను, మూడురోజులు సెలవుపెట్టి. ఇట్నుంచి రిజర్వేషన్ తంటాలన్నీ సత్యమే పడ్డాడు. సెంట్రల్ స్టేషన్లో దిగగానే ఆయన దర్శనమిచ్చాడు. కనపడ్డ వాళ్ళందర్నీ సుబ్బారావుగారు మీరేనా అని అడుగుతున్నట్టున్నాడు. నేను ఔననగానే సుప్రభాతం స్వాగతంచెప్పి కారులో తీసుకెళ్ళాడు. తిరిగి రావడానికి ఫస్టుక్లాసు టిక్కెట్టు తెప్పిం చాడు. నా మకాంకోసం తీసిన త్రీ స్టార్ హోటల్ గదికి.

కథమీద కూచున్నాం— ప్రొడ్యూసర్‌గారు, ఆయన బావగారు, నేను, రాయబోయే ఫిల్మ్‌కి కాబోయే డైరెక్టరుగారు, బి. ఓ. ఎ. సి. (బాక్సాఫీసు అడ్వయిజరీ కమిటీ) ఛైర్మన్‌గారు- రెండు రోజులపాటు హోరాహోరీగా డిస్కషన్లు చేశాం. కథ రూపం నిర్ధారణ అయింది. నేను అనుకున్న కథని ఏ కీలుకి ఆ కీలు విరగ్గొట్టేసినా, 'అత్యాధునిక వింత దోపిడీ అంతటా అమల్లో వుంది' అన్న ఎలిమెంటరీ థ్రెడ్ జారిపోకుండా కాపాడాను.

అగ్రిమెంటు రాసుకున్నాం. రెండువేలు అడ్వాన్సిచ్చారు.

రెండేళ్ళయింది. పిక్చర్ అనౌన్స్ కాలేదు. ఏమిటా అని ఆలోచించి, శలవుపెట్టి మద్రాసు వెళదామని నిర్ణయించాను. మా ఆఫీసర్ సెలవివ్వ నన్నాడు. ఖర్చులిచ్చి సత్యాన్ని పంపాను. రెండు రోజుల్లో వచ్చేశాడు.

''యామైంది ?'' అన్నాను.

''నీ మొహం అయింది! నువ్వు రాసిన అగ్రిమెంటు ప్రకారం తెలుగులో పిక్చర్ తియ్యడానికి నిబంధన లేదు. ఆ కథమీద పూర్తి హక్కులు ఇచ్చేశావు. ఆయనగారు ఆ కథని అరవంలో పిక్చర్ తియ్యడానికి పదిహేను వేలకి అమ్మాడు. అరవంలో ఆ పిక్చర్ రావడమూ జూబిలీలు చేసుకోడమూ అయింది. హిందీలో తీస్తామని సోహన్లాల్ మదన్లాల్ నిన్ననే నీ కథని నలభై వేలకి అతగాడి దగ్గర కొన్నారు !" అని చెప్పాడు సత్యం.

"పోనీ, నాకు రావలసిన ఐదువేల్లో మిగతా మూడువేలూ పంపుతున్నారా ?" అన్నాను.

"ఇస్తారిస్తారు ! తెలుగులో తీసినప్పటి మాట కదా !"

"ఇదొక వింత దోపిడీలా వుందే ?" అన్నాను నిస్సహాయంగా.

"అత్యాధునిక వింత దోపిడీ !" అన్నాడు సత్యం.

(23-6-79)